క్లుప్తంగా

ఘనంగా తెప్పోత్సవం



తెప్పలు వదులుతున్న మహిళలు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి వద్ద గోదావరిలో తెప్పోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రికి ముందు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించడం, గోదావరిలో తెప్పోత్సవాలు నిర్వహించడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. గోదావరి నదిని (దక్షిణ గంగా) గంగమ్మ తల్లిగా భావించి కృతజ్ఞతగా తెప్పోత్సవాలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ తెప్పోత్సవంలో భాగంగా తీపి నైవేద్యంతో పాటు పలురకాల పిండి వంటలు చేసి తెప్పపై ఉంచి గంగమ్మతల్లికి ప్రత్యేక నైవేద్యంగా సమర్పించి తమ కుటుంబాన్ని క్షేమంగా ఉంచాలని వేడుకున్నారు. మునిపెల్లి, మల్లాపూర్, చామన్‌పెల్లి, పార్‌పెల్లి, చింతల్ చందా, ధర్మారం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామానికి చెందిన ముస్కె రాజేశ్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి చిన్ననాటి మిత్రులు రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. 1999–2000లో ఏడో తరగతి చదువుకున్న మిత్రులు సోమవారం గ్రామంలో రాజేశ్ భార్య, పిల్లలకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. సుధాకర్, ప్రసాద్, మల్లేశ్, రాకేశ్, చంద్రమౌళి, చంద్రశేఖర్, మహేందర్, నర్సయ్య, రమేశ్ తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన



నిరసన తెలుపుతున్న రైతులు

ముధోల్: మండలంలోని విఠోలి తండా, విఠోలి గ్రామ రైతులు సోమవారం ముధోల్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కరెంటు సరఫరా సక్రమంగా అందించడం లేదని ఆరోపించారు. రాత్రి, మధ్యాహ్నం సమయపాలన లేకుండా విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఏఈ శ్రీకాంత్ ఇక నుంచి అంతరాయం ఉండదని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షల తనిఖీ



ప్రయోగ పరీక్షలు పరిశీలిస్తున్న పరిశీలకులు

లక్ష్మణచాంద: ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ప్రారంభమైన ఇంటర్ రెండో సంవత్సరం ప్రయోగ పరీక్షలను ఫ్లయింగ్ టీమ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వృక్షశాస్త్రం, భౌతిక శాస్త్రం ప్రయోగ శాలలను పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధ్వర్యంలో జరుగుతుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో పరిశీలకులు బలరామ్ జాదవ్, ఓం ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

గంగపుత్ర సంఘ భవనం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో రూ.10 లక్షల మత్స్యశాఖ నిధులతో నిర్మించిన గంగపుత్ర సంఘ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోమం, శివపార్వతుల కల్యాణం, దుర్గాదేవి పూజ, తదితర పూజలు చేసి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కులస్తుల సంప్రదాయ గొల్లెనతో కాలనీలో ఊరేగింపు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పరిమి సురేశ్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, బీజేపీ రాష్ట్ర నాయకులు రితీశ్ రాథోడ్, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్ తదితరులు ఉన్నారు.



కుంటాల: చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న అర్చకులు



కుభీర్: పాఠశాలలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు



భైంసాటౌన్: అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రబంధకారిణి సభ్యులు



నిర్మల్‌చైన్‌గేట్: విజయ హై స్కూల్‌లో..

ఘనంగా వసంత పంచమి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరస్వతీదేవి పుట్టిన రోజు సందర్భంగా ఆలయాల్లో, పాఠశాలల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. శ్రీసరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఖానాపూర్: కుంకుమార్చన పూజలు చేస్తున్న పండితులు



తానూరు: భోసి గ్రామంలోని మహాదేవుని ఆలయంలో అక్షరాభ్యాసం చేస్తున్న ఉపాధ్యాయులు



లోకేశ్వరం: పూజలు చేస్తున్న పాఠశాల సిబ్బంది



తానూరు: ఎల్వి అంగన్‌వాడీ కేంద్రంలో..



లక్ష్మణచాంద: రాచాపూర్‌లో..



సోన్‌లో..



ముధోల్: రవీంద్ర పాఠశాలలో..

'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం'

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష జరిగిందని ఆరోపిస్తూ నిరసనగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ పాలిత ప్రాంతాల రాష్ట్రాలకు బడ్జెట్లో అధిక నిధులు కేటాయించారన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ, పట్టణ అధ్యక్షుడు చిన్నూ పాల్గొన్నారు.

కడెం: కేంద్రం బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం చేసిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మండలాధ్యక్షుడు మల్లేశ్, సతీశ్‌రెడ్డి, రమేశ్, శంకర్, యాదగిరి, కమలాకర్, రహీం, బొడ్డు గంగన్న, ఇందూర్, లచ్చన్న, శ్రీనివాస్, బబ్లూ, బ్రహ్మచారి తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా గల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా.. నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, వైస్‌చైర్మన్ ఫారూక్ అహ్మద్, నాయకులు ప్ర సంజిత్ తదితరులు ఉన్నారు. కాగా తెలంగాణకు ని ధులు కేటాయించకుండా వివక్ష చూపడం సరికాద ని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ సుమాన్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్రబడ్జెట్‌పై నిరసన తెలిపారు. పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాహిద్, నాయకులు పాల్గొన్నారు.



నిర్మల్‌చైన్‌గేట్: ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఖానాపూర్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి కేంద్రప్రభుత్వ తీరును ఎండగట్టారు. నాయకులు సత్యం, షబ్బీర్‌పాషా, యూసుఫ్ ఖాన్, సత్యం, రాజేశ్వర్, షౌకత్‌పాషా, అశోక్, గంగాధర్, సత్యనారాయణ, నయీం తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వానికి అన్యాయం చేశారని సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆలయంలో అన్నదానం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గల అన్నపూర్ణ మహాదేవాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కాలేరి జనార్దన్ తెలిపారు. సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు. కాలనీవాసులు సంతోష్, చందు, రమేశ్, శంకర్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడిగా స్వామి

కడెం: బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ ఆదేశాల మేరకు యువజన విభాగం మండలాధ్యక్షుడిగా మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన కమ్మల స్వామిని నియమించినట్లు పార్టీ మండలాధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎంపీపీ మొలుగూరి రాజేశ్వర్‌గౌడ్, క్లాం తిరుపతిరెడ్డి, కోల గంగన్న, ముత్తినేని శివయ్య, కసుల రాజేశ్, కమ్మల శివ తదితరులు ఉన్నారు.

'నరేందర్ రెడ్డి గెలుపునకు కృషి చేద్దాం'

కుంటాల: ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ అధినేత వేమూరి నరేందర్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం కుంటాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థి గెలుపునకు పట్టభద్రులు సహకరించాలని కోరారు. మాజీ సింగిల్ విండో చైర్మన్ జుట్టు లక్ష్మణ్, మాజీ సర్పంచ్‌లు జుట్టు మహేందర్, వెంకటేశ్, మహేశ్వర్, రాకేశ్, మహిపాల్, నరేందర్, లక్ష్మణ్, సంతోష్, పట్టభద్రులు శ్రీనివాస్, ఉదయ్, రవి పాల్గొన్నారు.

'నరేందర్‌రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలి'

భైంసాటౌన్: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీలో ఉంటున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, తన విద్యాసంస్థల్లో ఎంతమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉచిత విద్యనందించారో శ్వేతపత్రం విడుదల చేయాలని పట్టభద్రుల సంఘం జిల్లా నాయకుడు చాకేటి లస్మన్న సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

7న 'లక్ష డప్పులు –వెయ్యి గొంతుకలు'

నర్సాపూర్ (జి): హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించే లక్ష డప్పులు –వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పెంట సునీత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఎంఎస్పీ కోఆర్డినేటర్ శనిగరాపు రవి, లక్ష్మణ్, బర్కుంట నరేందర్, ఎంహెచ్పీఎస్ మండల అధ్యక్షుడు అశోక్, సాగర్, ముత్యం, అనిల్ పాల్గొన్నారు.

'గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం'

కుంటాల: ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు కిరణ్ కొమ్రేవార్ పేర్కొన్నారు. కుంటాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేసవికి ముందే అప్రకటిత కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజకీయ లబ్ధి కోసమే కుల గణన సర్వే తప్పులతడకగా ప్రకటించి ఆర్భాటం ప్రదర్శించారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ పెంట వార్ దశరథ్, కిషన్, పోశెట్టి, డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు దహనం

ఖానాపూర్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ, కార్మిక రంగాలకు తీరని నష్టం జరిగిందని సీపీఎం పార్టీ ఏరియా కమిటీ సభ్యుడు డాకూరి తిరుపతి అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను పార్టీ ఆధ్వర్యంలో ఖానాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో దహనం చేశారు. కేంద్ర బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకంగా ఉందని, తెలంగాణకు సైతం నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. చుంచుల నారాయణ, గడ్డం రాజేశ్, తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: దేశ ప్రజలకు ఉపశమనం కలిగించాల్సిన యూనియన్ బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పోశెట్టి విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నాయకులు భూమన్న, లింగం, లక్ష్మీప్రసాద్, విజయ్, గజ్జన్న ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కుభీర్: మండల కేంద్రం కుభీర్‌లో సోమవారం తెలంగాణ ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్), 2025 క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు హన్మండ్లు, బీఆర్‌ఎస్ నాయకులు పిరాజి, నాయకులు అభిషేక్, ఉపాధ్యాయులు హన్మండ్లు, సమంత, రజిత, గజ్జవ్వ తదితరులు ఉన్నారు.

వేసవిలో నీటిఎద్దడి రాకుండా చూడాలి

ఖానాపూర్: త్వరలో ప్రారంభం కానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది దృష్టిసారించాలని ఎంపీడీవో సునీత అన్నారు. సోమవారం మండలంలోని మస్కాపూర్, సుర్జాపూర్, బాదనకుర్తి గ్రామాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి తాగునీటి సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆమె వెంట ఎంపీవో రత్నాకర్ రావు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన బద్దిపోచమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

జీవన ఎరువులపై అవగాహన

సారంగపూర్: మండలంలోని బోరిగాం గ్రామంలో భూమిలో పీఎస్‌బీ (భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా) జీవన ఎరువుల వినియోగంపై ఏవో వికార్ అహ్మద్ రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎస్‌బీని ఉపయోగించడం వల్ల భూమిలో ఉన్న భాస్వరం కరిగించి మొక్కలకు అందించే ప్రక్రియ వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. దీనివల్ల మొక్కలకు పోషణ సమకూరి దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. ఈపీఎస్‌బీ జీవన ఎరువులు మండల వ్యవసాయ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరం ఉన్న రైతులు కార్యాలయంలో సంప్రదించి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో ఉమేశ్, రైతులు తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏవో వికార్ అహ్మద్

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

కుభీర్: కుభీర్‌లో పలు విత్తన, ఎరువుల దుకాణాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి సారిక తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను పరిశీలించి ఎరువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన ఎరువులను, క్రిమిసంహారక మందులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు యూరియాను మోతాదుకు మించి వాడుతున్నారని, యూరియాకు బదులు నానో యూరియా వాడుకోవచ్చని తెలిపారు.



స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న సారిక

యాసంగి పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

పెంబి: యాసంగి సీజన్‌లో రైతులు పండిస్తున్న పంటల వివరాలను వ్యవసాయ శాఖ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నవీన్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని ఇటిక్యాల్ గ్రామ శివారులోని యాసంగిలో పండించిన పంట వివరాలను వ్యవసాయ శాఖ పోర్టల్‌లో నమోదు చేసి డిజిటల్ సర్వే ప్రారంభించారు. ఏఈవో రాజ్‌కుమార్ ఉన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోండి

సోన్: రైతువేదికలో ప్రతీ మంగళవారం జరిగే రైతు నేస్తం కార్యక్రమాన్ని మండలంలోని రైతులు సద్విని యోగం చేసుకోవాలని ఏఈవో జాదవ్ ఉమామహేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పంటలపై అడవి పందుల దాడి... రక్షణ మార్గాలపై శాస్త్రవేత్త డాక్టర్ వి.సునీత వివరిస్తారని తెలిపారు.

క్రైం కార్నర్..

భిక్షాటన చేసే వ్యక్తి మృతి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగించే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. అర్జున్ పండిట్ అనే వ్యక్తి ఉదయం భిక్షాటన చేస్తూ రాత్రి సాయిబాబా మందిరం వద్ద ఉండేవాడు. ఆదివారం ఆలయం గేటు వద్ద అపస్మారక స్థితిలో పడిపోయి ఉండగా గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఆయన చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు ఎవరికైనా తెలిస్తే రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలియజేయాలని పోలీసులు పేర్కొన్నారు.



అర్జున్ పండిట్ మృతదేహం

ఉపాధికి వెళ్లి అనంత లోకాలకు..

సారంగపూర్: కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండాలని కోటి ఆశలతో పనిలో చేరిన కొద్ది రోజుల్లోనే రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కంకెట గ్రామానికి చెందిన ముఖేశ్(22) ఇటీవల డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు రాసి ఇంటి వద్దే ఖాళీగా ఉంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన రాజు, శ్రీనివాస్‌లతో కలిసి గత 20 రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ట్రావెల్స్‌లో సహాయకులుగా చేరాడు. ముఖేశ్ పని చేసే బస్సు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో బస్సులో ముందు కూర్చున్న ముఖేశ్ ఎగిరి పడి అక్కడికక్క డే మృతి చెందాడు. సోమవారం మృతదేహాన్ని గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ముఖేశ్ తల్లి లక్ష్మి, సోదరి సునీత రోధించిన తీరు స్థానికులను కలిచివేసింది.



ముఖేశ్ (ఫైల్)

బాసరలో భక్తుల అవస్థలు



ఆలయ ప్రాంగణంలోని మెట్ల దారిలో నిద్రిస్తున్న భక్తులు



గోదావరి ఘాట్ పై భక్తుల రద్దీ

బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వసంత పంచమి పురస్కరించుకుని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు వచ్చిన తల్లిదండ్రులు క్యూలైన్‌లో పిల్లలను ఎత్తుకొని ఇబ్బందులు పడ్డారు. పిల్లలను ఆడిస్తూ లాలిస్తూ గంటల తరబడి నిరీక్షించారు. అధికారులు కనీస వసతులు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఆలయ ప్రాంగణంలో, రైల్వేస్టేషన్‌లో భక్తులు కునుకు తీశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



నాన్న భుజాలపై కూర్చుని క్యూ లైన్‌లో నిరీక్షిస్తున్న చిన్నారి